# మర్డరయా: మసాల దోసె





## సూరత్తు వేణుగోపాలరావు

**పొద్దున్నే** క్లబ్బులో మూడు సెట్లు టెన్నిసు ఆడి అలిసి పోయి బంగళాకి తిరిగి వచ్చాను. గడియారం ఠంగున ఎనిమిది కొట్టింది. స్నానం చేసి తాపీగా కాగితాలు చూసుకోవచ్చు గదా అను కుంటూ హాల్లో కుర్చీలో కూలబడి కాన్వాస్ బూట్లు విప్పే ప్రయత్నంలో ఉన్నాను. ఇంతలో ''దొరగారూ, దొరగారూ'' అని గావు కేకలు వేసు కుంటూ వెంకటస్వామి ప్రవేశించాడు.

ఆదివారం కొంచెం విశ్రాంతిగా గడిపి సాయంత్రం సతీ సమేతంగా సినిమా చూడాలని ప్లాను. కాని హత్యలకీ, మానభంగాలకీ తిథి వారాల విచక్షణ ఉంటుందా? అటువంటి దేదో శుభవార్త మోసు కొచ్చాడీ ప్రబుద్ధుడని లోలోపల తిట్టుకుంటూ ''ఏమిటోయ్? అంత హడావిడి? ఏం జరిగింది?'' అని తిరిగ్గా అడిగాను.

''హత్య, సార్! హత్య! దారుణమైన హత్య!''

ఎంత అసాధారణమైన పరిస్థితుల్లో కూడా చలించని ఈ మహా మొద్దు స్వరూపం ఇంత కలవర పడిపోతున్నాడంటే నాకు ఆశ్చర్యమేసింది. ''హత్యలు, దోపిడీలు మన పోలీసు ఉద్యోగంలో మామూలే కాబట్టి వాటికి మనం చలించకూడదని నాకు పాఠాలు నేర్పినవాడవు నువ్వే కదటోయ్? మరిప్పుడు ఇలా వణికిపోతున్నా వేమిటి? పాపం! ఇంతకీ ఎవ డా నిర్భాగ్యుడు?''




"ఇంకెవరు, సార్! ముల్లంగి మునసబు చలపతి."

"భూషయ్య తండ్రిని హత్య చేసి బెయిలు మీద ఉన్నాడు—వాడేనా? పోయిన సంవత్సరమంతా వాడి కేసులతో, తప్పుడు సాక్ష్యాలతో మనల్ని తిప్పలు పెట్టిన ముండాకొడుకు. ఇప్పుడు వచ్చి మనల్ని సాధిస్తున్న మాట! తప్పదుగా—సర, నేను స్నానం చేసి తయారుగా ఉంటాను. డ్రైవరుకి రమ్మని కబురు చెయ్యి. ఒక గంటలో ముల్లంగి వెళదాం."

"అయ్యబాబోయ్! దొరగారు పొరబడుతున్నారు. మర్డరు జరిగింది ముల్లంగి గ్రామంలో కాదండి. ఇక్కడే!"

"ఇక్కడా? ఏమిటి నువ్వనేది?"

"అవును, సార్, ఇక్కడే! శ్రీకృష్ణ విలాస్ ఉడిపి హోటల్ దగ్గిర ఘోరంగా పొడిచి చంపేశారు."

నేను గబ్బాలున లేచాను. 'ఈ మాట ముందే చెప్ప వచ్చు కదా' అని గొణుక్కుంటూ ఉన్న పళంగా బయలుదేరాను.

చలపతి చరిత్ర గుంటూరు జిల్లాలో అందరికీ తెలిసినదే. అతడు అపర రావణాసురుడని ప్రతీతి. అతను చేసిన అత్యాచారాలు కోకొల్లలు. గత రెండు దశాబ్దాలుగా వంశ పారంపర్యంగా వస్తున్న ముఠా తగాదాల్లో ప్రముఖ పాత్రధారి. హత్యలూ, దొమ్మీలతో ఆ గ్రామ చరిత్ర రక్తాక్షరాలతో మా పోలీసు రికార్డుల్లో లిఖించబడింది. పోయిన ఏడు తనతో విరోధం పెట్టుకున్న భూషయ్య తండ్రిని హత్య చేయించాడు. ఆ కేసు రావణాసురుడి కాష్ఠంలా ఇంకా కాలుతూనే ఉంది. కేసు సంగతి ఎలా ఉన్నా పగ తీర్చుకోక మానమని, భూషయ్య అనుచరులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారని గ్రామంలో పోలీసు పార్టీని కాపలా పెట్టి ఉంచాం.

నేరస్థలానికి చేరేసరికి జనం విపరీతంగా పోగై ఉన్నారు. వాళ్ళని అదుపులో పెట్టడానికి పోలీసులు నానా యాతనా పడుతున్నారు. అదే సమయానికి ఇన్‌స్పెక్టరు శేషగిరి వచ్చాడు. జనంలోంచి దారి చేసుకుని వచ్చి చూస్తే అక్కడ దృశ్యం భయానకంగా ఉంది. రిక్షా ఒక మూల బోర్లా పడిపోయి ఉంది. రోడ్డు మధ్యలో రక్తపు మడుగులో చలపతి శవం. ఆ శరీరం నిండా దారుణమైన కత్తిపోట్లు!

ఇన్‌స్పెక్టర్ శేషగిరి ముందుకు వచ్చి "హత్య చాలా విపరీతమైన పరిస్థితుల్లో జరిగింది, సార్. వూళ్ళో ఉన్న కష్టాల వల్ల భయపడి రెండు, మూడు నెలలుగా చలపతి ఇక్కడే ఉంటున్నాడు. ఇది తప్పకుండా భూషయ్య పార్టీ వాళ్ళు చేసిన పనే" అని అన్నాడు.

"ఆ సంగతి తరవాత చూద్దాం. అసలు హత్య ఎలా జరిగింది?" అని ప్రశ్నించాను.

"చలపతి ప్రతి రోజూ పొద్దున్నే ఉడిపి హోటలుకి వచ్చి టిఫిన్ తీసుకోవడం అలవాటు. ఈ రోజు అలాగే రిక్షాలో వస్తుంటే ముసుగులు వేసుకున్న వ్యక్తులు ఇద్దరు అటకాయించి కత్తులతో పొడిచి పక్కన సందుల్లోంచి పారిపోయారట. రిక్షావాడు కూడా భయంతో పారిపోయాడు" అని శేషగిరి వివరించాడు.

గుంటూరు పట్టణంలో ముసుగు మనుషులా! ఏదో అపరాధ పరిశోధక నవలలాగా చిత్రిస్తున్నాడు. కాని పట్టపగలు నడి బజారులో భయంకరంగా హత్య జరిగిందంటే ప్రజలు భీతావహ చెందక పోరు. దేశం అరాచకమై పోతూందని, పోలీసులనే వాళ్ళు ఉన్నారా అని కుశల ప్రశ్నలు వెయ్యకపోరు. అందు చేత ఈ కేసుని తక్షణం పట్టుకోవలసిన అవసరం జిల్లా సూపర్నెంటుగా ఉన్న నాకు తప్పదు.

"సరే. పంచాయితీ ప్రారంభించండి. దర్యాప్తు నేనే ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తాను. ఇరవై నాలుగు గంటల్లో ఈ హత్య వెనక ఉన్న వాళ్ళని అరెస్టు చెయ్యకపోతే మనం తల ఎత్తుకుని తిరగలేము" అని మహాభారతంలో సైంధవుణ్ణి సూర్యాస్తమయ పూర్వమే సంహరించెదనన్న పాండవమధ్యముని వలె ప్రతిజ్ఞ చేసి పారేశాను.

ఇన్‌స్పెక్టరు వినయంగా "ఈ స్వల్పమైన కేసు పరిశోధించటం కోసం తమరి కెందుకు శ్రమ? ఆ భూషయ్యని, వాడి అనుచరుల్ని పట్టుకుని రావడానికి ప్రత్యేకమైన పార్టీని ఇప్పుడే పంపించేస్తున్నాను. వాళ్ళని ఈ సాయంత్రం లోపల తమ ముందు నిల బెట్టకపోతే నా పేరు శేషగిరి కాదు" అని అయన కూడా సమయానుకూలంగా మీసాలు దువ్వుకుంటూ మరో ప్రతిజ్ఞ చేశాడు.

తాటాకుల చప్పుళ్ళకి కుందేళ్ళు బెదురుతాయా అన్నట్లు ప్రతిజ్ఞలతో హత్యా రహస్యాలు ఛేదించ గలిగితే ఇంకేం? నేర పరిశోధన అంత సులభంగా జరిగే పని కాదు. దాని తతంగం చాలా ఉంది. ఏం తికమకలు ఉంటాయో మెలకువగా చూసు కోవాలి. తిరుగులేని సాక్ష్యం సేకరించాలి. శేషగిరి అన్నట్లు ఈ నేరం భూషయ్య పగ తీర్చుకోటానికే అని అనుకోవటానికి ఆధారాలు బలవత్తరంగానే ఉన్నాయి. అయినా వూరు కాని వూళ్ళోకి వచ్చి హత్య చెయ్యాలంటే మాటలా! భూషయ్య ఏ కిరాయి కిరాతకులనో ఉపయోగించి ఉండాలి. వాళ్ళు ఎక్కడ నుంచి వచ్చారు, ఎలా మాయమయ్యారు అన్న విషయాల మీదే పరిశోధన ఆధారపడి ఉంది.

శవపంచాయతీ పూర్తి చేసి హతుడి శవాన్ని పోస్టుమార్టం పరీక్షకి పంపించి పోలీసు స్టేషన్ చేరుకునేసరికి పదమూడు గంటలు దాటింది. నేర స్థలంలో ఏ విధమైన ఆధారాలు కనపడలేదు. హంతకులు హోటలు వెనక ఉన్న సందు గొందుల్లో నుంచి వచ్చి అలాగే తిరిగిపోయినట్లుగా ఉంది. కాని ఎవ్వరూ చూడలేదంటే ఆశ్చర్యంగా ఉంది. ఎవరిని ప్రశ్నించినా మాకు తెలియదని తప్పుకుంటున్నారు. చూశామంటే, నేలన పోయేదాన్ని నెత్తిన రాసు కున్నట్లవుతుందన్న సంకోచం అందరికీ సహజంగా ఉంటుంది. అడగ్గా అడగ్గా చివరికి ఆ ప్రాంతంలోనే నివసిస్తున్న రామకృష్ణయ్యగారు హత్యాకాండ చూసి ఉండవచ్చును అన్న విషయం చూచాయగా తెలిసింది. వెంటనే ఆయన కోసం కబురు చేశాం.

రామకృష్ణయ్యగారికి ఆంధ్ర దేశంలో నటకావతం సుడు అన్న పెద్ద పేరు ఉంది. ఆయన నాటకా లను నేను చిన్నప్పుడు చూచి ఉండడం వల్ల నాకు కూడా ఎంతో గౌరవం. ఆయన రాగానేనాఅభిమానాన్ని వ్యక్తం చేసుకుని అసలు విషయానికి వచ్చాను.

సంగతి ఎత్తగానే రామకృష్ణయ్య కంపించి పోయాడు. హావ భావ ప్రకటనలో సిద్ధహస్తుడు. అది నటనో, నిజమో నాకు తెలియలేదు. కాని, పాపం! పొద్దున్నే చూచిన ఆ భయానక దృశ్యం ఆయన్ని నిజంగానే కలచి వేసినట్లుంది.

"సూపర్నెంటుగారూ, క్షమించండి. ఆ టైమ్‌లో నేను అటునుండి వస్తున్న మాట సత్యమే కాని, నేను పరధ్యాన్నంగా ఉన్నాను. అంతా ఒక్క క్షణంలో జరిగిపోయింది. ఇద్దరు మనుషులు అకస్మాత్తుగా రిక్షా మీద పడ్డారు. పడటమేమిటి, రక్తం చిందింది. బాబోయ్, బాబోయ్ అంటూ రిక్షా వాడు పరుగు తీశాడు. నే నక్కడ ఉంటే నన్నుకూడా పొడుస్తారేమోనని ఇంటి దారి పట్టాను."

"రామకృష్ణయ్యగారూ, ఇద్దరు హంతకు లంటున్నారు. గుర్తుపట్టగలరనుకుంటాను."

"గుర్తా? ముఖాలకి ముసుగులు వేసుకున్న

వాళ్ళని గుర్తు పట్టడం సాధ్యమటండీ?'' అని ఆయన ప్రశ్న వేశారు.

''ముసుగులా? అంటే మన సినిమాల్లో చూపిన నల్లని బురఖాలు కాబోలు.''

''అబ్బే! అలాంటివి కాదండీ—ఏవో తువ్వాళ్ళు చుట్టుకున్నారు—అంతే.''

''అయితే ఈ విషయంలో మాకు మీ రేమీ సహాయం చెయ్యలేరన్న మాట. మీ మీద కొండంత ఆశ పెట్టుకున్నాం.''

ఆయన కొంచెంసేపు ఆలోచించి ''సాధారణ పౌరుడుగా మీకు సహాయం చెయ్యవలసిన బాధ్యత నాకు ఉంది. కాని ఈ పరిస్థితుల్లో ఎవరైనా... ఉండండి... ఒక్క విషయం మరిచి పోయాను. ఆ ఇద్దరిలో ఒకడు ఎర్ర గీరలున్న పచ్చటి లుంగీ కట్టుకున్నాడు''అన్నారు.

ఇదేదో మంచి ఆధారంగానే ఉంది. నా ఉత్సాహం ఇనుమడించింది. ''అంటే ఆ హంతకుల్లో ఒకడు ముస్లిం అన్న మాట'' అన్నాను.

రామకృష్ణయ్యగారు చిరునవ్వుతో ''కావచ్చు—కాని ఈ రోజుల్లో ఆడవాళ్ళతో సహా అందరూ లుంగీలే కట్టుకుంటున్నారు కదండీ'' అన్నారు.

ఆ పటకాగ్రేసర చక్రవర్తికి వీడ్కోలు ఇచ్చి పంపించేస్తుంటే ఎప్పుడు వచ్చాడో వెంకటస్వామి స్థాణువులా నిలబడి వింటున్నాడు. ''స్వామీ, అలా కళ్ళప్పగించి చూస్తున్నావు. నువ్వు వెళ్ళిన పని ఏమయింది? ఆ రిక్షా వాడు దొరికాడా, లేదా?''

వెంకటస్వామి సెల్యూట్ చేసి ''దొరికాడు, సార్'' అంటూ బయటికి వెళ్ళి వాడిని తీసుకొచ్చాడు. ''వీడి ఆచూకీ తీసేటప్పటికి తల ప్రాణం తోక కొచ్చింది, సార్. వూరి బయట శివాలయంలో దాక్కుని ఉన్నాడు. ఎంత అడిగినా నోట మాట పెగలటం లేదు.''


ఇన్స్పెక్టరు శేషగిరి అందుకుని ''వీడికి హంతకులతో లాలూచీ లేకపోతే అంత భయమెందుకు? సరాసరి స్టేషన్‌కి వచ్చి రిపోర్టు చెయ్యకుండా పరారై పోతాడా? నాలుగు తగిలిస్తే వీడే కాదు, వీడి తాత ముత్తాతలుకూడా దిగి వస్తారు. ఏరా!' అని ఘర్జించాడు.

''నా కీ సంగతి తెలియదు బాబోయ్'' అంటూ ఆ మానవుడు మొదలు నరికిన మానులా కూలి పోయాడు.

''నేను కలగచేసుకుని ఉండండి. వాలకం చూస్తే వీడికేమీ తెలిసినట్లు లేదు. రామకృష్ణయ్యఅంతటివాడే ఏమీ చూడలేకపోతే వీడెంత? వీడిని ఇప్పుడు బాధ పెట్టడం భావ్యం కాదు. వెంకటస్వామీ, సూరయ్యని బయటికి తీసుకెళ్ళి—వాడు కొంచెం తేరుకున్నాక నెమ్మదిగా ప్రశ్నించ వచ్చులే'' అన్నాను.

''అలాగే, సార్. రిక్షా సూరయ్య వట్టి అమాయకుడండీ, మనం అనవసరంగా చెయ్యి చేసుకోవడం...''

ఇన్స్పెక్టర్ శేషగిరి వెంకటస్వామిని కొరకొరా చూడడం నేను గమనించక పోలేదు. ఇంతలో డిప్యూటీ సూపర్నెంటు హడావుడిగా వచ్చి సెల్యూట్ చేసి కూర్చున్నాడు. ''గుడ్‌మార్నింగ్, సార్! నేను క్యాంపు నుండి ఇప్పుడే వచ్చాను. వార్త వినగానే




పరుగెత్తుకుంటూ వచ్చేశాను. నేను లేనప్పుడే ఈ హత్య జరగడం ఘోరం.''

డిప్యూటీ సూపర్నెంటు సర్వేశ్వరరావు పోలీసు జీవితంలో చాలా ఢక్కామొక్కీలు తిని పైకి వచ్చిన అనుభవశాలి. అంత మాత్రాన తాను ఉంటే ఈ హత్య జరిగి ఉండేది కాదని అనుకోవటం మరీ అన్యాయం. అదీ కాకుండా ఆయన వాలకం చూస్తుంటే సుష్టుగా భోజనం చేసి తీరిగ్గా ఒక కునుకు తీసి వచ్చిన మనిషిలా కనబడుతున్నాడు. నేను ఆదిపట్టించుకోకుండాశేషగిరితో ''భూషయ్యని అతని, తమ్ముళ్ళని వాళ్ళకి శకునిలా సలహా లిచ్చే సభాపతిని తక్షణం అరెస్టు చేసి తెమ్మని పార్టీని ముల్లంగికి పంపించావుగా! ఏమన్నా సమాచారం తెలిసిందా?'' అని అడిగాను.

''వాళ్ళంతా పరారై పోయారు, సార్. ఇప్పుడే అక్కడ నుంచి కబురు అందింది.''

సర్వేశ్వరరావు నవ్వు ముఖంతో ''ఇంకేం మన అనుమానం నిజమే'' అని తాళం వేశాడు.

''సరే. మీరు వాళ్ళని పట్టుకోవడానికి సర్వ ప్రయత్నాలు చెయ్యండి. మూడు పోలీసు పార్టీలు తయారు చేసి చుట్టుపక్కల గ్రామ గ్రామాలు వెతికించండి. ఆ పనిని సర్వేశ్వరరావుగారికి అప్ప గిస్తున్నాను. భూషయ్య మనుష్యులకి ఇక్కడకూడా స్థావరాలు ఉండొచ్చు. ఇక్కడ వాళ్ళని వెతికే పని ఇన్స్పెక్టరు శేషగిరి నిర్వహించాలి. వెళ్ళండి. మీ దగ్గిర నుంచి సమాచారం వచ్చే వరకూ ఇక్కడ ఉంటాను'' అని బాధ్యతలు అప్పగించి పంపించి వేశాను.

ఏదో ఆవేశంలో సాయంత్రం లోపల హంతకుల్ని పట్టుకుంటానని ప్రతిజ్ఞ చేశాను కాని, పరారై పోయిన వాళ్ళని పట్టుకోవడం అంత తేలిగ్గా కనపడటం లేదు. ఏం చెయ్యడమా అని ఆలోచిస్తూ కూర్చుండి పోయిన నేను ''దొరగారూ, దొరగారూ'' అన్న వెంకటస్వామి పిలుపు వినపడే వరకూ ఈ లోకం లోకి రాలేదు.

''స్వామీ, పెర్చి పార్టీలతో నీ వెందుకు వెళ్ళ లేదు'' అని చిరాకు పడ్డాను.

స్వామి ఏ సమాధానం చెప్పకుండా ఒక కప్పు కాఫీ బల్లమీద పెట్టి ''తీసుకోండి సార్. పొద్దుటి నుండి తమరు కాఫీకూడా తాగలేదు'' అంటూ ''ఇవాళ నాకు ఆఫ్ డ్యూటీ సార్'' అన్నాడు.

నాకు కోపం వచ్చింది. ''నువ్వనేదేమిటి? ఈ పరిస్థితుల్లోకూడా డ్యూటీ లేదంటూ మీస వెంట్రుకలు లెక్క పెట్టుకుంటూ కూర్చుంటావా? పోలీసులకి అవసరమయినప్పుడు ఇరవై నాలుగు గంటలూ డ్యూటీయే.''


''క్షమించండి దొరగారూ. తమరి ఆజ్ఞ ధిక్కరించ దానికి నాకు ఎన్ని గుండెలు? కాని అమ్మగారు...'' అని నసిగాడు.

నేను విసుగ్గా ''మధ్యలో అమ్మగారేమిటి... నువ్వు అసంబద్ధంగా మాట్లాడకు'' అని కేకలు వేశాను.

''అయ్యా ఆగ్రహించకండి. తమరు పొద్దుటి నుంచి వచ్చి మంచినీళ్ళయినా తీసికోకుండా ఇక్కడ ఉండిపోయారు. అక్కడ అమ్మగారు మనస్సు చాలా కష్ట పెట్టుకుంటున్నారు. దొరగారి భోజన సదుపాయాలు చూసుకోమని నాకు ఆర్డర్లీతో కబురు పెట్టారు. ఎవరి ఆజ్ఞ పరిపాలించాలో తెలియక కాస్త సందిగ్ధంలో పడ్డ మాట వాస్తవమే.''

''అలాగా చాలా గొప్పగా ఉంది. పొద్దున్న జరిగిన హత్యలో నువ్వేదో పొడిచేస్తావని నేననుకుంటుంటే నా భోజనం కోసం పడి కొట్టుకుంటున్నావా? మరి నీ సంగతేమిటి? పొద్దున్న ఏడు గంటలకి డ్యూటీలో దిగిన వాడివి హత్యావృత్తాంతం మోసుకుని వాదగ్గిరి కెలా వచ్చావు? నీకీ సంగతి అసలు ఎలా తెలిసింది?'' అని నిలదీసి అడిగాను.

''నేనుకూడా తమలాగే పొద్దుట నుంచీ వచ్చి మంచినీళ్ళయినా ముట్టుకోలేదంటే నమ్మండి, సార్ ఏడు గంటలకి డ్యూటీ దిగగానే ఉడిపి హోటల్‌కి




వెళ్ళాను.''

''ఓహో! అక్కడ ఈ హత్య జరుగుతుందని ముందే కల కన్నావు కాబోలు. నీవు చాలా ప్రబుద్ధుడివిలే'' అని వెటకారంగా అనకుండా ఉండలేక పోయాను.

''అదేమీ లేదండి. రాత్రి మా ఆవిడతో కొంచెం ఘర్షణ పడి అలిగి భోజనం మానేశాను. అందుచేత హోటలుకి వెళ్ళి ఒక మసాలా దోసెకి ఆర్డరు ఇచ్చాను.''

''ఇంకేం పోలీసులందరికీ అన్నపూర్ణ లాంటి మంచి హోటలు దొరికిందిగా, ఉల్ఫాగా ఇడ్లీలు, దోసెలూ...''

''అంత మాట అనకండి, దొరగారూ. తమరు అనుగ్రహించి నాకు ప్రమోషన్ ఇప్పించినప్పటి నుంచీ అణా పైసలతో చెల్లించి వేస్తున్నాను.''

అందరూ మీలాగే ఉంటే హోటలు యజమానులు బతికిపోతారు. ఆదిసరేకాని అసలు సంగతి చెప్పవేం?''

''వస్తున్నాను, సార్. ఆర్డరిచ్చిన అరగంట దాకా మసాలాదోసె రాకపోవటం వల్ల నాకు ఒళ్ళు మండిపోయింది. సర్వీస్ ఇంత అధ్వాన్నంగా ఉందేమిటని అడగడానికి మేనేజరు దగ్గరకు వెళ్ళాను. ఎవరో కొత్తాయన రమణమూర్తి అట. గల్లాపెట్టె దగ్గర కూర్చున్నాడు. ఈ మధ్యనే హోటలు యజమాని మారిపోయాడని నా కేం తెలుసు? ఎవరైతే నేం, ఛెడా మడా పెట్టాను. ఆయన ఏదో సర్ది చెప్పబోయాడు. ఇంతలో పక్క వీధిలో పెద్ద గోల. అందరితో పాటు నేనుకూడా పరుగెత్తుకు వెళ్ళాను. ముల్లంగి మునసబుని ఎవరో దారుణంగా చంపేశారన్నారు. దానితో మరేమీ ఆలోచించకుండా తమ దగ్గిరికి వచ్చి వాలాను.''

''బాగానే ఉంది నువ్వూ నీ మసాలాదోసె! ఈ దోసెల భాగవతంవల్ల పుణ్యమా, పురుషార్థమా?'

ఆ మాటలు అంటుండగానే వెంకటస్వామిలో ఒక గొప్ప మార్పు వచ్చింది. నీలాకాశంలో తటిల్లతల వలె ఆ నల్లటి ముఖంలో కళ్ళు విచిత్రంగామెరిశాయి.

''దొరగారూ, దొరగారూ! తమరు తక్షణం బయలుదేరాలి. శ్రీ కృష్ణావిలాస్‌కి వెళ్ళి వద్దాం'' అన్నాడు.

''అంటే, అక్కడ నన్ను కూడా ఒకటో రెండో మసాలా దోసెలు తినమంటావు. అంతేనా?''

''తమరు పొద్దుటి నుంచి నిద్రాహారాలు లేకుండా ఇలా శ్రమ పడుతుంటే కష్టంగా ఉందయ్యా. అదికాదు. మరొకసారి తమరు ఆ హోటల్ పరిసరాలు క్షుణ్ణంగా పరిశీలిస్తే ఏవైనా కొత్త ఆధారాలు దొరకవచ్చు.''

వెంకటస్వామి ఏదో ఒక మిష పైన నన్ను హోటల్‌కి తీసుకెళ్ళాలని ప్రయత్నిస్తున్నాడు. ''సరే, పద'' అని బయలుదేరాను.

హోటల్ చాలా రద్దీగా ఉంది. అదృష్టవశాత్తు నేను మఫ్టీలోనే ఉన్నాను కాబట్టి నా సంగతి ఎవరూ పట్టించుకోలేదు. స్వామి భగీరథ ప్రయత్నం చేసి ఎలాగైతేనేం చోటు చేసి ఒక బల్ల దగ్గిర కూర్చోబెట్టి తాను నిలబడే ఉన్నాడు.

''ఫరవాలేదు, స్వామీ. కూర్చో. నువ్వలా బేతాళుడులా నిలబడితే అందరి కళ్ళు మన మీదే ఉంటాయి.''

వెంకటస్వామి ఏదో ముళ్ళమీద కూర్చున్నట్లు ఉన్నాడు. ''దొరగారూ, తమరి సెలవైతే రెండు మసాలా దోసెలు తెప్పిస్తాను. ఈ హోటల్‌లో దోసె బ్రహ్మాండంగా ఉంటుందంటే నమ్మండి.'' కడుపులో ఆకలి దహించుకు పోతూంది. ''సరే'' అన్నాను. అన్నానో లేదో స్వామి వెయిటర్‌ని పిలిచి ఆర్డరుఇచ్చాడు. మనిషినీ చూస్తుంటే ఏదో మధన పడుతున్నట్లుగా కనిపించాడు. అతనికి ఎదురుగా ఉన్న తలుపులో నుండి వంట గది దాని బయట ఉన్న రుబ్బురోలు చూస్తూ ఏదో పరధ్యాన్నంలో పడ్డాడు.

అయిదు నిమిషాల్లో వెయిటరు మసాలా దోసెలు వాటితో పాటు చట్నీ, సాంబారు వగైరాలు మా ముందు ఉంచాడు. నేను ఫలహారం చెయ్యడానికి ఉపక్రమించి ఒక ముక్క తుంచి నోటిలో పెట్టు

18—1—84

కున్నానో లేదో ఉప్పు కశంలోపల బంగళాదుంపలు ఉడకలేదు.

''ఛీఛీః ఇక్కడ దోసె కని ఏని ఎరగని బ్రహ్మాండమైన వంటకం అన్నావు. అఘోరించి నట్లుంది'' అని ప్లేటు పక్కకి తోసి పారేశాను.

స్వామి ఉలిక్కి పడ్డాడు . కోపంతో అతని కళ్ళు ఎరుపెక్కి పోయాయి. ఒక్కఉదుటున లేచి వంటింట్లోకి పరుగు తీయడ మేమిటి, అక్కడ పొయ్యి ముందు నిలబడి పెనం మీద దోసెలు వేస్తున్న వాడి చెంప మీద చెళ్ళున కొట్టడ మేమిటి ఒక్క క్షణంలో జరిగిపోయింది. పైగా భీకరంగా అరుస్తున్నాడు. ''ఏరా, దొంగలం...కొడకా! పెద్ద దొరగారు హోటల్‌కు వస్తే నీవు చేసిన నిర్వాకం ఇదా: నీతోలు ఒలిచేస్తాను చూసుకో నా తడాఖ?''

ఇక పూరుకుంటే లాభం లేదు. ఈ ముది వస్మవు వెంకటస్వామి వల్ల నేను కూడా అల్లరి పాలవుతున్నాను అనుకుంటూ వంటింట్లోకి వెళ్ళాను. ఏదో గొడవ జరుగుతూందని హోటల్ మేనేజరు రమణమూర్తి కూడా వచ్చాడు. నేను ''వెంకటస్వామీ, నీ ప్రవర్తన ఏమీ బాగా లేదు. ముందు బైటికి రా'' అని అరిచాను.

వెంకటస్వామి నా మాటకూడా వినిపించుకోకుండా వంటవాడి మెడ పట్టుకుని ''ఎప్పుడూ దోసెలు వేసే అయ్యరుగాడు ఏమయ్యాడురా! నువ్వు మాచర్లలో ఉండే మస్తానువు కదూ? కసాయి ముండా వాడివి నువ్వు దోసెలు వెయ్యడం ఎప్పుడు నేర్చుకున్నావ్? అందుకే అలా తగలడ్డాయి. దుర్మార్గుడా! అంతా తెలిసి పోయిందిలే'' అని గర్జించాడు.

పరిస్థితులు ఆకస్మాత్తుగా తారుమారై పోయాయి. వంటవాడు గజగజలాడిపోతూ, ''అంతా చెప్పేస్తానయ్యా ఈ అయ్యగారు చెయ్యమంటే చేశాము'' అంటూ లబో మన్నాడు.

అంతా అయోమయంగా ఉన్నా వెంకటస్వామి ఉద్వేగానికి, పొద్దున్న జరిగిన హత్యాకాండకి ఏదో సంబంధం ఉందని నాకుకూడా తట్టింది. ఇంతలో మెల్లగా జారుకోబోతున్న రమణమూర్తిని ''ఆగు'' అంటూ వెంకటస్వామి అటకాయించి ''దీని కంతటికీ కథానాయకుడివి నువ్వన్నమాట. చలపతిని పొడిచి చంపిన కత్తులు ఎక్కడ దాచారు?'' అని మరో సింహనాదం చేశాడు.

రమణమూర్తి మాట్లాడలేదు. భయంతో వణికి పోతున్న మస్తాన్ ''ఈ పొయ్యిలోనే పడేశాం'' అని గుట్టు కాస్తా బయట పెట్టేశాడు.

ఏదో గందరగోళం జరుగుతూందని జనం మూగుతున్నారు. అదే సమయంలో ఇన్‌స్పెక్టర్ శేషగిరి వచ్చి, ''భూషయ్య మనుషు లందరూ పట్టుబడ్డారు, సార్. వాళ్ళని లాకప్‌లో పెట్టించాను. తమరుకూడా దయ చేయండి'' అని సగర్వంగా అన్నాడు.

''అది సరే. ముందు ఈ జనాన్ని బయటికి పంపించి హోటల్ చుట్టూ కాపలా పెట్టండి'' అని ఆదేశించాను.

తరవాత భగభగ మండుతున్న పొయ్యి ఆర్పించి,

అందులో ఉన్న కత్తులని స్వాధీనం చేసుకుని, మస్తాన్ సాయిబుని రమణమూర్తిని తీసుకుని పోలీసు స్టేషన్‌కి వెళ్ళే టప్పటికి రాత్రి ఏడు గంటలయింది. అక్కడ సర్వేశ్వరరావుతోనూ శేషగిరితోనూ "ఈ హత్య చెయ్యించింది రమణ మూర్తి. చేసిన వాళ్ళు మస్తానువాడితోపాటు పని చేస్తున్న భీమయ్య. భీమయ్యని పట్టుకోవడానికి మనుషుల్ని పంపించండి. భూషయ్యని అతని మను షుల్ని వదిలేసి రమణమూర్తి, మస్తాన్ల వాఙ్మూలాలు తీసుకోండి" అని పురమాయించి ప్రతిజ్ఞ నెరవేరిన ఉన్న ఆనందంతో ఇంటికి వెళ్ళిపోయాను.

● ● ● ●

హాయిగా స్నానం, భోజనం ముగించి, లాన్‌లో కూర్చుని హత్యా విశేషాలు, మన ప్రయోజకత్వం గురించి మా ఆవిడకు విపులీకరిస్తుంటే, తను పెద్ద హాయింటే వేసింది. "ఇంతకీ రమణమూర్తి మీద అనుమానం ఎలా వచ్చింది?"

"ఆ మాట నిజమే. అసలు వెంకటస్వామికి ఆ అనుమానం ఎలా వచ్చిందో నాకుకూడా అవగాహన కాలేదు." ఇంతలో స్వామి రానే వచ్చాడు.

"రావోయ్, రా, నీ విషయమే అనుకుంటున్నాం."

"అంతా మీ దయ, సార్."

"ఇది నీకు ఒక పూలపడం అయిపోయింది. అసలు రమణమూర్తి మీద అనుమానం ఎలా వచ్చిందో చెప్పవేం?"

"నాకుకూడా ముందు అతని మీద అనుమానం రాలేదు, సార్. పొద్దుట హోటలుకి వెళ్ళినప్పుడు మసాలా దోసె తేవడంలో జరిగిన ఆలస్యం నాకూ, మన పోలీసు డిపార్టుమెంటుకీ అవమానకరంగా తోచి బాధ పడ్డానే కాని, ఆ కోపంలో హోటలు హోనరు మారిపోయాడన్న సంగతే మరిచిపోయాను. మీ రెప్పుడూ చెబుతుంటారు కదా—అపరాధపరిశోధనలో ఏదైనా అసాధారణంగా కనపడితే దాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని! ఆ సలహా గుర్తుకు వచ్చి వాకబు చేస్తే మేనేజరు రమణమూర్తి ముల్లంగి గ్రామానికి చెందిన వాడేనని తెలిసింది. హోటలు దగ్గరే హత్య జరగడం. మేనేజరు ఆ వూరు వాడవడం, హత్య జరిగిన సమయంలో దోసెలు సరిగ్గా అందకపోవడం, వీటన్నిటికీ ఏదైనా సంబంధం ఉందేమో నని నాకు అనుమానం కలిగింది. అందుచేత తమరుకూడా మరొకసారి పరిశీలిస్తే బాగుంటుందని అనుకున్నాను. తీరా లోపలికి వెళ్ళాక నా అనుమానం దృఢ పడింది" అని స్వామి వివరించాడు.

"అదెలాగోయ్? నువ్వు కిచన్‌లోకి వెళ్ళేదాకా ఏమీ తెలియదుగా!"

"అందుకేనండీ తమ చలవ అన్నది. హోటల్లో తమరు నన్ను కూచోమన్నా తమంతటి వారి ముందు కూర్చోవడానికి సంశయిస్తుంటే బలవంతంగానే కూర్చోబెట్టారు. అప్పుడు కనపడింది..."

"ఏమిటి?"

"రామకృష్ణయ్యగారు చెప్పిన గళ్ళ లుంగీ లాంటిదే దొడ్లో ఆరేసి ఉంది. దాన్ని గురించి ఆలోచిస్తూ ఉంటే మీరు చిరాకుగా ప్లేటు పక్కకి తోసేశారు. ఉదయం దోసె తేవటంతో చేసిన ఆలస్యం, సాధారణంగా ఎప్పుడూ మహా రుచిగా ఉండే దోసె తమరు చెత్తగా ఉందనడం వల్ల కీలకం అంతా ఈ కిచన్‌లోనే ఉందని అకస్మాత్తుగా తట్టింది. కోపంగా లోపలికి వెళ్ళి వాడి చెంప వాయించాను. ఇంతా చూస్తే ఆ దోసెల స్పెషలిస్టు అయ్యరు బదులు ఈ మాచర్ల మస్తాన్‌గాడు ఉన్నాడు. వాడిని నేను, నన్ను వాడు గుర్తు పట్టాం. దానితో నిజం బయట పడ్డది."

"శభాష్, వెంకటస్వామీ! నా ప్రతిజ్ఞ నిల బెట్టావు. అయితే ఈ హత్య చేయించడానికి కారణం రమణమూర్తి వాఙ్మూలంలో చెప్పాడా?"

"చెప్పాడు, సార్. ఇరవై ఏళ్ళ క్రితం రమణ మూర్తి అక్కని చలపతి బలవంతంగా మానభంగం చేయుటం వల్ల ఆత్మహత్య చేసుకుంది. ఆ అవమాన భారంతో మంచం పట్టి తల్లితండ్రులు చని పోయారు. కుటుంబమంతా ఛిన్నాభిన్నమైపోయింది. తలెత్తుకోలేక అతను వూరు విడిచి పారిపోయాడు. దేశదేశాలు తిరిగి డబ్బు సంపాదించుకుని ఈ హోటల్ కొన్నాడు. చలపతి రోజూ హోటల్‌కి రావడం చూసి, ఎలాగైనా అతని మీద మనస్సులో నిరంతరం రగులుతూన్న పగ సాధించడానికి ప్లాన్ వేశాడు. అందుకే ఆ రోజు అయ్యర్లకి సెల విచ్చి మస్తాన్ సాయిబుని, భీమయ్యని వంటవాళ్ళుగా ప్రవేశ పెట్టి హత్య చెయ్యించాడు" అని విశదీకరించాడు.

"ఓహో, అదా సంగతి! రమణమూర్తి గొప్ప ప్లాను వేశాడు. కాని, నీ తెలివితేటల ముందు ఎందుకూ కొరగాకుండా పోయింది. ఇంతకీ నువ్వు భోజనం చేశావా?"


"లేదు, సార్. ఈ సంగతంతా తమకు చెప్పి వెళదామని పోలీస్‌స్టేషన్ నుంచి సరాసరి వచ్చేశాను."

"పాపం, రోజంతా కష్టపడ్డావు. నిన్న రాత్రికూడా మీ ఆవిడతో తగువు లాడానన్నావు. ఇంత లేటుగా వెళ్ళి భోజనం పెట్టమంటే ఏం గొడవ అవుతుందో! ఇక్కడే భోజనం చేసి వెళ్ళు" అని నా భార్యకేసి తిరిగి, "రమా, వెంకటస్వామికి భోజనం పెట్టించు" అన్నాను.

"అబ్బెబ్బే, అమ్మ గారికి అంత శ్రమ ఎందు కండి" అని స్వామి లేవబోయాడు.

మా ఆవిడ "పరవాలేదులే, మా నాయరు ఉన్నాడుగా! అన్నీ చూస్తాడు. భోజనం చేసి వెళ్ళు" అని నాయరుని పిలిచి, అతనితో వెంకటస్వామిని లోపలికి పంపించింది. తరవాత తిరిగ్గా "ఇందాక మీరు కేసు సంగతి చెబుతుంటే అంతా మీ పరాక్రమమే అనుకున్నాను. అసలు సంగతి ఇదన్న మాట!" అన్నది కొంచెం ఎగతాళిగా నవ్వుతూ. ●

## సరసమైన సంక్రాంతులు



క్షసురుకోకుండ డాక్టర్లు పేషంట్లను
గారవించిన నాడు ఆరోగ్య సంక్రాంతి
స్టూడెంట్లు వానర్ల చొక్కాలపై సిరా
చల్లకుండిన అదే చల్లని సంక్రాంతి
అత్తవారింటిలో క్రొత్తల్లునకు శిర
మ్మెత్తకుండిన అదే మెత్తని సంక్రాంతి
హాస్టళ్ళలోని విద్యార్థులు చక్కగా
చదివి ప్యాసైన అది చైతన్య సంక్రాంతి
వృద్ధ హీరోలు నవీన హీరోలకు
అవకాశమిచ్చిన అది చిత్ర సంక్రాంతి
ఉన్నతోద్యోగులు చిన్న గుమాస్తాల
వేడుకున్న అది విలువయిన సంక్రాంతి
రసహీనమగు చచ్చు రచనకు రచయితల్
స్వస్తి చెప్పిన అది సాహిత్య సంక్రాంతి
కోటీశ్వరుల కొడుకులు బీద పిల్లల
ప్రీతి పెండ్లాడ అది జాతీయ సంక్రాంతి
భవ్యరత్నాలు దేశిక సువర్ణాలతో
అన్యోన్యమున్న అది ఆదర్శ సంక్రాంతి
ముంగిళ్ళ రంగు రంగుల రంగవల్లికల్
చెంగలించిన అది బంగారు సంక్రాంతి
మకరరాశి సువర్ణమయ సూర్య కిరణాలు
దెసల ప్రసరించ అది సిసలైన సంక్రాంతి
యువశక్తి యుగశక్తి నవనవోన్మేషమై
పొంగులెత్తిన అది పొంగళ్ళ సంక్రాంతి
గుమ్మడి పూలతో గొబ్బిళ్ళ వాకిళ్ళ
శోభిల్లుచున్న అది సౌభాగ్య సంక్రాంతి.
వరకట్న రాక్షసిన్ నరికి ముక్కలు చేసి
అగ్ని కాహుతి చేయ అది భోగి సంక్రాంతి
ఆరసాలు విరసాలు సరసాలు ఏకమై
కలిసి కాంతులు చిమ్మ అది తెలుగు సంక్రాంతి
మధురమగు మన తెనుగు అధికారభాషయై
అవతరించిన అదే అభ్యుదయ సంక్రాంతి.

— కరుణశ్రీ